

వైద్య ప్రక్రియలో పాల్గొన్న గ్లెనీగల్స్ ఆస్పత్రి వైద్య బృందం

వృద్ధురాలికి అరుదైన చికిత్స

● 'వాచ్‌మన్' పరికరంతో వైద్యం

హైదరాబాద్ సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రక్తనాళాలు మూసుకుపోయి పక్షవాతం బారినపడిన ఓ వృద్ధురాలికి ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరం లేకుండానే లక్డీకాపూల్‌లోని గ్లెనీగల్స్ ఆస్పత్రి వైద్య బృందం 'వాచ్‌మన్' పరికరం ద్వారా లెఫ్ట్ ఎట్రియల్ అపెండేజ్ క్లోజర్ వైద్య ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారు. మంగళవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గ్లెనీగల్స్ ఆస్పత్రి డాక్టర్ ఎం.సాయి మాట్లాడారు. నగరానికి చెందిన 65 ఏళ్ల వృద్ధురాలికి కర్ణిక దడ వల్ల గుండె ఎడమ కర్ణిక అపెండేజ్‌లో రక్తం గడ్డకట్టి పక్షవాతంతో ఇబ్బంది పడుతుందని తెలిపారు. స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గించే ప్రత్యామ్నాయంగా కార్డియాలజీ బృందం 'వాచ్‌మన్' పరికరం ద్వారా సమస్యను సరిచేసినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ ఒక గంటలోపు పూర్తైందని, రోగి పూర్తిగా కోలుకోవడానికి కొంత సమయం పట్టిందని తెలిపారు. వాచ్‌మన్ పరికరం చిన్న పరాచూట్ ఆకారంలో ఉండే ఇంప్లాంట్ అని, ఇది కర్ణిక దడ ఉన్న రోగుల్లో ఎక్కువగా రక్తం గడ్డ కట్టే గుండె ఎడమ కర్ణిక అపెండేజ్‌ను మూసివేసే విధంగా పనిచేస్తుందని ఆయన వివరించారు. ఈ సర్జరీ చేసిన వైద్యులను ఆస్పత్రి సీఓఓ మిస్టర్ మాధ్వీ ఖురానా అభినందించారు.



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న క్యాన్సర్ విజేతలు, వారి సంరక్షకులు, వైద్య నిపుణులు, ఆస్పత్రి సిబ్బంది

క్యాన్సర్‌ను త్వరగా గుర్తిస్తే నయం చేయొచ్చు

హైదరాబాద్ సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌ను త్వరగా నయం చేయడానికి ఆధునిక చికిత్సలు, ప్రక్రియలు, మందులు అందుబాటులో ఉన్నాయని, త్వరగా వ్యాధిని గుర్తిస్తే నయం చేయవచ్చునని మెడికవర్ ఆస్పత్రి అంకాలజిస్టులు పేర్కొన్నారు. మంగళవారం మాదాపూర్‌లోని మెడికవర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో 'క్యాన్సర్ సర్వైవర్స్ మంత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. 'సెలబ్రేటింగ్ ది సూపర్ హీరోస్' అనే థీమ్‌తో జరిగిన ఈ కార్యక్రమంలో క్యాన్సర్ విజేతలు, వారి సంరక్షకులు, వైద్య నిపుణులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు. క్యాన్సర్‌ను జయించిన వారి స్ఫూర్తిని, ధైర్యాన్ని పెంపొందించి, మిగతా వారిలో మనోనిబ్బరాన్ని కల్పించడానికి ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ ప్రవీణ్ క్యాన్సర్ చికిత్సలో ఎదురయ్యే సవాళ్లను వివరించారు. చిన్నపిల్లల కోసం సరికొత్త రేడియేషన్ పద్ధతుల పురోగతులను రేడియేషన్ ఆంకాలజిస్టు డాక్టర్ ప్రశాంత్ విశదీకరించారు. రోబోటిక్ సర్జరీల ప్రయోజనాలను సర్జికల్ అంకాలజిస్టు, రోబోటిక్ సర్జన్ డాక్టర్ రవి చందర్ వివరించారు. ఈ పద్ధతుల వల్ల మెరుగైన ఫలితాలు, త్వరితగతిన కోలుకునే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో మిసెస్ ఇండియా తెలంగాణ క్రౌన్ విజేత 2025 మిథాలీ అగర్వాల్, క్యాన్సర్ సర్వైవర్స్ సుమంతి చూరుకంటి పాల్గొని తమ అనుభవాలను వివరించారు.

'హామీలను నెరవేర్చిన తర్వాతే ఆటో పర్మిట్ జీవోను అమలు చేయాలి'

నల్లకుంట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చిన తర్వాతే ఆటో పర్మిట్ జీవోను అమలు చేయాలని తెలంగాణ ఆటో అండ్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్స్ జేఏసీ నేతలు సూచించారు. ఎల్‌పీజీ, సీఎన్‌జీ, ఎలక్ట్రిక్ ఆటోలు పాత ఆటో పర్మిట్ల స్థానంలోనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంగళవారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ కన్వీనర్ రవిశంకర్ అల్లూరి మాట్లాడారు. బీఆర్‌ఎస్, వామపక్ష, ఏఐటీయూసీ అనుబంధ ఆటోడ్రైవర్ల సంఘం నేతలు ప్రభుత్వంతో లోపాయికారి ఒప్పందం చేసుకుని కొత్త ఆటో పర్మిట్లను తీసుకువచ్చి ఆటోడ్రైవర్లను మోసం చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో జేఏసీ నాయకులు రవికుమార్, కొమరయ్య, రవి, హబీబ్, ఈశ్వర్, సాయిలు, శ్రీధర్‌రెడ్డి, సమ్మయ్య, పెంటయ్యగౌడ్, వజ్రలింగం తదితరులు పాల్గొన్నారు.

ఆహారంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

● టూరిజం ప్లాజాలో మంత్రి జూపల్లి ఆకస్మిక తనిఖీలు

బేగంపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): టూరిజం ప్లాజా హోటళ్ల శుభ్రంగా ఉండాలని, ఆహారంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో మంగళవారం ఉదయం మంత్రి జూపల్లి ఆకస్మిక తనిఖీలు చేశారు. రెస్టారెంట్ అంతా కలియతిరుగుతూ ఆహార పదార్థాలను, కిచెన్‌ను పరిశీలించారు. అల్పాహారం చేస్తున్న పర్యాటకులు, అతిథులతో జూపల్లి మాట్లాడారు. ఆహారం నాణ్యత, రుచి గురించి ఆరా తీశారు. అనంతరం జూపల్లి మాట్లాడుతూ హరిత హోటళ్లలో సౌకర్యాలు, ఆహార నాణ్యతపై నిరంతరం పరిశీలన కొనసాగిస్తామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ ఆదాయం పెంచడంతో పాటు పర్యాటకులు, అతిథుల కోసం మెరుగైన సదుపాయాల కల్పనపై ప్రధానంగా దృష్టి పెడుతున్నామని తెలిపారు. ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా హరిత హోటళ్లను తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.



టూరిజం ప్లాజాలో తనిఖీ చేస్తున్న మంత్రి జూపల్లి

ఏహెచ్‌టీయూ కార్యాలయం ప్రారంభం

హైదరాబాద్ సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. ఈ మేరకు సిటీ కమిషనరేట్ పరిధిలోని పాత సీసీఎస్ (సెంట్రల్ జోన్ ఉమెన్ పీఎస్ ప్రాంగణం)లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూని ట్ (ఏహెచ్‌టీయూ), జువెనైల్ బ్యూరో కార్యాలయాలను మంగళవారం సీపీ ప్రారంభించారు. వాటితో పాటు.. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థతో కలిసి బాధితుల కోసం ప్రత్యేక సహాయ విభాగాన్ని సీపీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీపీ వెంట క్రైమ్స్ అండ్ సిట్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్, ఉమెన్ సేఫ్టీ డీసీపీ లావణ్య, ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ సునీత, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ సునీతాకృష్ణన్ తదితరులు ఉన్నారు.



ఏహెచ్‌టీయూ, జేబీ కార్యాలయాలను ప్రారంభిస్తున్న సిటీ సీపీ సీవీ ఆనంద్,

ఓయూలో ఆర్.నారాయణమూర్తి



ఆర్.నారాయణమూర్తితో విద్యార్థి సంఘాల నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణ మూర్తి తన సినిమా 'యూనివర్సిటీ' ప్రమోషన్‌లో భాగంగా మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లారు. ఓయూలోని వామపక్ష, దళిత విద్యార్థి సంఘాల నాయకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

జనగణనలో కులగణన చేపట్టకుంటే యుద్ధమే : వీహెచ్

హైదరాబాద్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): జనగణనలో భాగంగా కులగణననూ కేంద్ర ప్రభుత్వం చేపట్టకుంటే రోడ్లపైకి వచ్చి యుద్ధం చేస్తామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హన్మంతరావు హెచ్చరించారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

వర్షాకాలం ఇబ్బందులు లేకుండా చూద్దాం

● ఖైరతాబాద్ ఉప కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి

ఖైరతాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అన్ని ప్రభుత్వ సంస్థల సమన్వయంతో వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేద్దామని జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్ ఉప కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఖైరతాబాద్ సర్కిల్ కార్యాలయంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం, ట్రాఫిక్ పోలీసులు, హైడ్రా అధికారులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ట్రాఫిక్ పోలీసులు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రజనీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ వరద నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రత్యేక సిబ్బందితో ఎప్పటికప్పుడు క్యాచ్‌పిట్లలో వచ్చే చెత్తను తొలగింపజేస్తామన్నారు. హైడ్రా వారు చెట్లు పడిపోతే వెంటనే స్పందించి వాటిని తొలగించే పనులు చేపట్టాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చేయాలని సూచించారు. జీహెచ్ఎంసీతో పాటు పోలీసు శాఖ, హైడ్రా, విద్యుత్ శాఖలతో వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేసి వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బంది వచ్చినా, గ్రూపులో పెట్టి సత్వర పరిష్కారం దిశగా పనిచేద్దామని నిర్ణయించారు. ప్రతీ డివిజన్‌లో ఒక మాన్‌సూన్ యాక్షన్ టీం ఉంటుందని, వారికి ఒక వాహనం అందుబాటులో ఉంచి అందులో అన్ని రకాల పనిముట్లు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. సమావేశంలో ట్రాఫిక్ ఏసీపీ కె.హరిప్రసాద్, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, సంజీవ్, హైడ్రా ఎస్ఎఫ్ఓ మోహన్‌రావు, జీహెచ్ఎంసీ ఈఈ వెంకటనారాయణ, డీఈలు చైతన్య, సందీప్ పాల్గొన్నారు.



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న చిన్నారెడ్డి

సీఎం ప్రజావాణికి 272 దరఖాస్తులు

బేగంపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణికి మొత్తం 272 దరఖాస్తులు వచ్చాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 51, రెవెన్యూ 74, ఇందిరమ్మ ఇళ్ల కోసం 28, విద్యుత్ శాఖకు 24, ప్రవాసి ప్రజావాణికి 2 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 93 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి సంబంధిత అధికారులతో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

జర్మనీలో ఉన్నత విద్యావకాశాలు ఎక్కువ

● ఎంపీ డేనియల్ జెర్బిన్



మాట్లాడుతున్న డేనియల్ జెర్బిన్

వెంగళరావునగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జర్మనీలో అత్యున్నత ప్రమాణాలతో విద్యా బోధన జరుగుతుందని జర్మనీ రాజకీయవేత్త, పార్లమెంట్ సభ్యుడు డేనియల్ జెర్బిన్ అన్నారు. వరల్డ్ లీడర్స్ సమ్మిట్‌లో పాల్గొనడానికి నగరానికి వచ్చిన ఆయన మంగళవారం వెంగళరావునగర్‌లోని నలంద విద్యాసంస్థను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో పలు అంశాలపై మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. జర్మనీలో ఉన్నత విద్య అవకాశాలు, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో జరుగుతున్న అభివృద్ధి, పరిశోధనల గురించి ఆయన వివరించారు. తమ దేశంలో మెడిసిన్, ఇంజినీరింగ్ విద్యను అభ్యసించడానికి రావాలని వారిని ఆహ్వానించారు. విద్యార్థులకు గ్లోబల్ అవకాశాలు, చట్ట వ్యవస్థలు, పౌరుల బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు ప్రశ్నలు వేస్తూ తమ అనుమానాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో నలంద విద్యా సంస్థల చైర్మన్ మంతెన శ్రీనివాస్ రాజా, డైరెక్టర్ ఎం.సూర్యనారాయణ కశ్యప్ వర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిట్స్‌తో యువకుడి మృతి

యూసుఫ్‌గూడ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఫిట్స్ రావడంతో అపస్మారక స్థితిలోకి పోయిన యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అరిపినేని వివేక్(28) శ్రీకృష్ణనగర్‌లో ఉంటూ సినిమా రంగంలో సెట్ వర్క్ హెల్పర్‌గానూ, జూనియర్ ఆర్టిస్ట్‌గానూ పనిచేస్తున్నాడు. ఈనెల 15న సినిమా షూటింగ్‌కు వెళ్లిన వివేక్‌కి షూటింగ్ స్థలంలో ఫిట్స్ వచ్చింది. ప్రాథమిక చికిత్స అనంతరం ఇంటికి పంపించారు. అనంతరం కృష్ణానగర్‌లో మద్యం తాగి సమీపంలోని జగదాంబ శానిటరీ దుకాణం పక్కన ఫుట్‌పాత్‌పై మృతిచెందాడని జూనియర్ ఆర్టిస్ట్ ఏజెంట్ దేవన్న పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బాత్‌రూమ్‌లో పడి యువకుడు..

యూసుఫ్‌గూడ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): బాత్‌రూమ్‌లో పడిన యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రహ్మత్‌నగర్‌కు చెందిన బొడ్డు మధు(27) డ్రైవర్. బాత్ రూమ్‌లోకి వెళ్లి ఎంతకూ బయటకు రాకపోవడంతో తండ్రి నర్సింగ్‌యాదవ్ బాత్ రూమ్ తలుపు పగలగొట్టి చూడగా కిందపడి అపస్మారక స్థితిలో ఉన్నాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. తండ్రి నర్సింగ్ యాదవ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపీ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 11 కేవీ అయ్యన్న ఫ్రైడ్, కేబీఆర్ పార్క్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లోనూ, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11 కేవీ గుట్టలబేగంపేట, లోటస్ పాండ్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లోనూ విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.



రాష్ట్ర కార్మిక శాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వివేక్ వెంకటస్వామిని మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపిన హెచ్‌సీఏ సంయుక్త కార్యదర్శి బసవరాజు

సమస్యల సత్వర పరిష్కారానికి బస్తీబాట

బోరబండ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సమస్యల సత్వర పరిష్కారం బస్తీబాటతో సాధ్యమని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి అన్నారు. హెచ్.ఎఫ్.నగర్ ఫేజ్-1లో వివిధ శాఖల అధికారులతో కలిసి మంగళవారం పర్యటించారు. బస్తీవాసులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మురుగునీరు, తాగునీరు, వీధిదీపాలు వంటి సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సంబంధిత అధికారులతో చర్చించి వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సర్కిల్-19 ఏఈఈ భరత్, వాటర్ వర్క్స్ మేనేజర్లు జయప్రకాష్, రాజేందర్, వీధిదీపాల సూపర్‌వైజర్ రాజు, అధికారులు, బస్తీవాసులు పాల్గొన్నారు.

బస్తీలు, కాలనీల అభివృద్ధి కృషి చేయాలి

ఎర్రగడ్డ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నూతన కమిటీ సభ్యులు బస్తీలు, కాలనీల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహ్మద్ అజారుద్దీన్ పిలుపునిచ్చారు. ఎర్రగడ్డ డివిజన్ శాస్త్రినగర్ అధ్యక్షుడిగా గెలుపొందిన బాలరాజు మంగళవారం మర్యాద పూర్వకంగా అజారుద్దీన్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల నిర్వహణకు తన వంతు సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో దూడల రవిగౌడ్, రమేష్ నాయక్, జ్యోతిబాయి, శ్రీకృష్ణ, సి.వెంకటేష్‌గౌడ్, విఠల్, ప్రకాష్, సత్యనారాయణ, పోస్పాల్, రవి, అజయ్‌గౌడ్, జి.వెంకటేష్, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్, ఖాళీ స్థలాల బహిరంగ వేలం వద్దు

● మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన

అమీర్‌పేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అవసరమయ్యే కమ్యూనిటీ హాల్, ఖాళీ స్థలాలను ప్రభుత్వం బహిరంగ వేలం వేసే ఆలోచనలు మానుకోవాలని, అలా చేయని పక్షంలో పార్టీలకతీతంగా ఏకమై ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన హెచ్చరించారు. మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వానికి నిధులు సమకూర్చేందుకు గృహ నిర్మాణ శాఖ, హౌసింగ్ బోర్డు అధికారులు ప్రభుత్వ స్థలాల విక్రయానికి నివేదికలు అందజేయడం దారుణమన్నారు. నగరంలోనే ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఎస్ఆర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌ను విక్రయించే అధికారం ప్రభుత్వానికి లేదన్నారు. ఈ కమ్యూనిటీ హాల్ వేలానికి సంబంధించి 20న వెలువరించనున్న నోటిఫికేషన్ సన్నాహాలను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన

అంగన్వాడీ కేంద్రాల్లో క్రమశిక్షణ

ఎర్రగడ్డ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల్లో నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, పౌష్టికాహారం లభిస్తుందని అంగన్వాడీ ఎర్రగడ్డ సెక్టార్ సూపర్‌వైజర్ శోభారాణి తెలిపారు. మంగళవారం ఎర్రగడ్డ డివిజన్‌లోని బంజారానగర్ అంగన్వాడీ కేంద్రంలో స్థానికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు శకుంతల, కవిత, ప్రీస్కూల్ విద్యార్థులు, తల్లులు పాల్గొన్నారు.

ఈనెల 30వరకు రేషన్ బియ్యం పంపిణీ

ఖైరతాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఆహార భద్రతా కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికీ ఈనెల 30 వరకు మూడు నెలల సన్నబియ్యం పంపిణీ జరుగుతుందని, ఈనెల మొత్తం రేషన్ దుకాణాలు తెరిచే ఉంటాయని సర్కిల్-7 ఏసీఎస్ఓ బి.జ్యోతి తెలిపారు. మంగళవారం ఆమె స్థానికంగా 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఖైరతాబాద్‌లో మొత్తం 54,682.86 క్వింటాళ్ల బియ్యం అవసరం ఉండగా, ఇప్పటి వరకు 81 రేషన్ దుకాణాలకు 54,013.49 క్వింటాళ్ల సన్న బియ్యం పంపిణీ చేశామని, అందులో 45,602.97 క్వింటాళ్ల బియ్యాన్ని లబ్ధిదారులు రేషన్ దుకాణాల్లో తీసుకున్నారని తెలిపారు.

సీసీఎస్‌లో ఏహెచ్‌టీయూ కార్యాలయం ప్రారంభం



ఏహెచ్‌టీయూ, జేబీ కార్యాలయాలను ప్రారంభిస్తున్న సిటీ సీపీ సీవీ ఆనంద్,

హైదరాబాద్ సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. ఈ మేరకు సిటీ కమిషనరేట్ పరిధిలోని పాత సీసీఎస్ (సెంట్రల్ జోన్ ఉమెన్ పీఎస్ ప్రాంగణం)లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్‌టీయూ), జువెనైల్ బ్యూరో కార్యాలయాలను మంగళవారం సీపీ ప్రారంభించారు. వాటితో పాటు.. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థతో కలిసి బాధితుల కోసం ప్రత్యేక సహాయ విభాగాన్ని సీపీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీపీ వెంట క్రైమ్స్ అండ్ సిట్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్, ఉమెన్ సేఫ్టీ డీసీపీ లావణ్య, ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ సునీత, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ సునీతాకృష్ణన్ తదితరులు ఉన్నారు.

క్యాన్సర్‌ను త్వరగా గుర్తిస్తే నయం చేయొచ్చు



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న క్యాన్సర్ విజేతలు, వారి సంరక్షకులు, వైద్య నిపుణులు, ఆస్పత్రి సిబ్బంది

హైదరాబాద్ సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌ను త్వరగా నయం చేయడానికి ఆధునిక చికిత్సలు, ప్రక్రియలు, మందులు అందుబాటులో ఉన్నాయని, త్వరగా వ్యాధిని గుర్తిస్తే నయం చేయవచ్చునని మెడికవర్ ఆస్పత్రి అంకాలజిస్టులు పేర్కొన్నారు. మంగళవారం మాదాపూర్‌లోని మెడికవర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో 'క్యాన్సర్ సర్వైవర్స్ మంత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. 'సెలబ్రేటింగ్ ది సూపర్ హీరోస్' అనే థీమ్‌తో జరిగిన ఈ కార్యక్రమంలో క్యాన్సర్ విజేతలు, వారి సంరక్షకులు, వైద్య నిపుణులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు. క్యాన్సర్‌ను జయించిన వారి స్ఫూర్తిని, ధైర్యాన్ని పెంపొందించి, మిగతా వారిలో మనోనిబ్బరాన్ని కల్పించడానికి ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ ప్రవీణ్ క్యాన్సర్ చికిత్సలో ఎదురయ్యే సవాళ్లను వివరించారు. చిన్నపిల్లల కోసం సరికొత్త రేడియేషన్ పద్ధతుల పురోగతులను రేడియేషన్ అంకాలజిస్టు డాక్టర్ ప్రశాంత్ విశదీకరించారు. రోబోటిక్ సర్జరీల ప్రయోజనాలను సర్జికల్ అంకాలజిస్టు, రోబోటిక్ సర్జన్ డాక్టర్ రవి చందర్ వివరించారు. ఈ పద్ధతుల వల్ల మెరుగైన ఫలితాలు, త్వరితగతిన కోలుకునే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో మిసెస్ ఇండియా తెలంగాణ క్రౌన్ విజేత 2025 మితాలీ అగర్వాల్, క్యాన్సర్ సర్వైవర్స్ సుమంతి చూరుకంటి పాల్గొని తమ అనుభవాలను వివరించారు.

65ఏళ్ల వృద్ధురాలికి అరుదైన చికిత్స

- 'వాచ్‌మన్' పరికరంతో వైద్యం



వైద్య ప్రక్రియలో పాల్గొన్న గ్లెనీగల్స్ ఆస్పత్రి వైద్య బృందం

హైదరాబాద్ సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రక్తనాళాలు మూసుకుపోయి పక్షవాతం బారినపడిన ఓ వృద్ధురాలికి ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరం లేకుండానే లక్డీకాపూల్‌లోని గ్లెనీగల్స్ ఆస్పత్రి వైద్య బృందం 'వాచ్‌మన్' పరికరం ద్వారా లెఫ్ట్ ఎట్రియల్ అపెండేజ్ క్లోజర్ వైద్య ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారు. మంగళవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గ్లెనీగల్స్ ఆస్పత్రి డాక్టర్ ఎం.సాయి మాట్లాడారు. నగరానికి చెందిన 65 ఏళ్ల వృద్ధురాలికి కర్ణిక దడ వల్ల గుండె ఎడమ కర్ణిక అపెండేజ్‌లో రక్తం గడ్డకట్టి పక్షవాతంతో ఇబ్బంది పడుతుందని తెలిపారు. స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గించే ప్రత్యామ్నాయంగా కార్డియాలజీ బృందం 'వాచ్‌మన్' పరికరం ద్వారా సమస్యను సరిచేసినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ ఒక గంటలోపు పూర్తైందని, రోగి పూర్తిగా కొలుకోవడానికి కొంత సమయం పట్టిందని తెలిపారు. వాచ్‌మన్ పరికరం చిన్న పరాచూట్ ఆకారంలో ఉండే ఇంప్లాంట్ అని, ఇది కర్ణిక దడ ఉన్న రోగుల్లో ఎక్కువగా రక్తం గడ్డ కట్టే గుండె ఎడమ కర్ణిక అపెండేజ్‌ను మూసివేసే విధంగా పనిచేస్తుందని ఆయన వివరించారు. ఈ సర్జరీ చేసిన వైద్యులను ఆస్పత్రి సీఓఓ మిస్టర్ మాధ్వి ఖురానా అభినందించారు.

జనగణనలో కులగణన చేపట్టకుంటే యుద్ధమే : వీహెచ్

హైదరాబాద్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): జనగణనలో భాగంగా కులగణననూ కేంద్ర ప్రభుత్వం చేపట్టకుంటే రోడ్లపైకి వచ్చి యుద్ధం చేస్తామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హన్మంతరావు హెచ్చరించారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జనగణన అంటున్న కేంద్రం.. అందులో కులగణన ప్రస్తావన ఎందుకు చేయడంలేదని ప్రశ్నించారు. అగ్రకులాలకు చెందిన రాహుల్, రేవంత్‌రెడ్డిలు బీసీల కోసం ఆలోచన చేస్తుంటే.. బీసీని అని చెప్పుకుంటున్న ప్రధాని మోదీ మాత్రం బీసీల గురించి ఆలోచించట్లేదన్నారు. జనగణన వల్ల బీజేపీకి లాభం తప్ప.. బీసీలకు లాభం లేదన్నారు.

ఓయూలో ఆర్.నారాయణ మూర్తి



ఆర్.నారాయణ మూర్తితో విద్యార్థి సంఘాల నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణ మూర్తి తన సినిమా 'యూనివర్సిటీ' ప్రమోషన్‌లో భాగంగా మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లారు. ఓయూలోని వామపక్ష, దళిత విద్యార్థి సంఘాల నాయకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

'హామీలను నెరవేర్చిన తర్వాతే ఆటో పర్మిట్ జీవోను అమలు చేయాలి'

నల్లకుంట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చిన తర్వాతే ఆటో పర్మిట్ జీవోను అమలు చేయాలని తెలంగాణ ఆటో అండ్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్స్ జేఏసీ నేతలు సూచించారు. ఎల్‌పీజీ, సీఎన్‌జీ, ఎలక్ట్రిక్ ఆటోలు పాత ఆటో పర్మిట్ల స్థానంలోనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంగళవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ఆటో అండ్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్స్ జేఏసీ కన్వీనర్ రవిశంకర్ అల్లూరి మాట్లాడారు. బీఆర్ఎస్, వామపక్ష, ఏఐటీయూసీ అనుబంధ ఆటోడ్రైవర్ల సంఘం నేతలు ప్రభుత్వంతో లోపాయికారి ఒప్పందం చేసుకుని కొత్త ఆటో పర్మిట్లను తీసుకువచ్చి ఆటోడ్రైవర్లను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో తెలంగాణ ఆటో అండ్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్స్ జేఏసీ నాయకులు రవికుమార్, కొమరయ్య, రవి, హబీబ్, ఈశ్వర్, సాయిలు, శ్రీధర్‌రెడ్డి, సమ్మయ్య, పెంటయ్యగౌడ్, వజ్రలింగం తదితరులు పాల్గొన్నారు.

చిలకలగూడ మున్సిపల్ మైదానాన్ని అభివృద్ధి చేయాలి

ప్రతిపాదనలు కాగితాలకే పరిమితం.. స్థానికుల డిమాండ్



చిలకలగూడ మున్సిపల్ మైదానం



వాహనాల పార్కింగ్



వ్యర్థాలు

చిలకలగూడ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌కు కూతవేటు దూరంలో, నగరం నడిబొడ్డున చిలకలగూడ మున్సిపల్ మైదానం నెలకొని వుంది. దాదాపు ఎకరం స్థలం. గతంలో ఉన్న రెండు అంతస్తుల్లో మొదటి అంతస్తులో వార్డు కార్యాలయం, ప్రైమరీ హెల్త్ సెంటర్, కింద షాపులతో కళకళ లాడుతుండేది. శిథిలావస్థకు చేరుకోవడంతో కూల్చివేశారు. ఆ తర్వాత ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదు. ప్రస్తుతం అక్కడ నిర్మాణ వ్యర్థాలు, వాహనాల పార్కింగ్, చెత్త చెదారంతో నింపి వేస్తున్నారు. దీంతో అంటువ్యాధులు పెరిగే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గమనించ దగ్గ విషయం ఈ మైదానానికి గేటు ఏర్పాటు చేశారు.

ప్రతిపాదనలు

ఎనిమిది సంవత్సరాల క్రితం కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయగా అప్పటి కమిషనర్ పరిశీలించి అద్దెలు కూడా రావని తిరస్కరించడంతో ఆ ప్రతిపాదన అటకెక్కింది. తర్వాత కమర్షియల్‌గా అభివృద్ధి చేసి పైన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు. అది కూడా కొలిక్కిరాలేదు. తాజాగా వాకింగ్ ట్రాక్ నిర్మించి మార్నింగ్ వాకర్స్‌కి అనుకూలంగా పార్కును నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ తరహాలో అభివృద్ధి చేసి చిన్న చిన్న ఎగ్జిబిషన్లు ఏర్పాటుకు ఇవ్వవచ్చు. చుట్టుపక్కల ఉన్న స్కూళ్లకు ఆట స్థలాలు లేకపోవడంతో అద్దెలకి ఇవ్వవచ్చనే ప్రతిపాదనలు వచ్చాయి. ఏది సానుకూలం కాలేదు. ప్రస్తుతం వినాయక చవితి పండుగకు కృత్రిమ కొలనులు నిర్మించి నిమజ్జనానికి, బక్రీద్ పురస్కరించుకుని మేకలు, గొర్రెల అమ్మకానికి, సంక్రాంతి పురస్కరించుకుని గాలిపటాలు ఎగర వేయటానికి వినియోగిస్తున్నారు.

అభివృద్ధి చేయండి

నగరం నడిబొడ్డున విశాలమైన స్థలం అందరికి అనుకూలంగా వుండటంతో చక్కగా అభివృద్ధి చేసి ప్రజలందరికి ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. వాకింగ్ ట్రాక్ నిర్మించి, పార్క్‌గా అభివృద్ధి చేస్తే ఉపయోగకరంగా వుంటుంది. చిలకలగూడ, సీతాఫల్ మండి, మైలార్‌గడ్డ తదితర ప్రాంతాల వారు ఉదయం వాకింగ్‌కి అటు ఉస్మానియా యూనివర్సిటీ, రైల్వే గ్రౌండ్స్‌కి వెళ్లాల్సివస్తుంది. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

అభివృద్ధికి చర్యలు



వాకింగ్ ట్రాక్ నిర్మించి సభలు, సమావేశాలు నిర్వహించడానికి అనుకూలంగా వుండేటట్లు నిర్మాణాలు చేయటానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం. గతంలో దీన్ని డంపింగ్ యార్డుగా మార్చడానికి ప్రయత్నాలు జరిగాయి. ఎట్టి పరిస్థితుల్లో డంపింగ్ యార్డుని రానివ్వం. అందరికి అందుబాటులో వుండే విధంగా అభివృద్ధికి కృషి చేస్తా.

- పద్మారావు గౌడ్, సికింద్రాబాద్. శాసన సభ్యుడు

వాకింగ్ ట్రాక్ నిర్మిస్తే బాగుంటుంది



చుట్టుపక్కల మైదానం లేకపోవడంతో వాకింగ్‌కి చాలాదూరం వెళ్లాల్సివస్తోంది. అందరికి అనుకూలంగా అందుబాటులో వుండటంతో వాకింగ్ ట్రాక్ నిర్మించి, ఓపెన్ జిమ్ లాంటిది ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ప్రస్తుతం వాకింగ్ కోసం ఉస్మానియా యూనివర్సిటీ, రైల్వే గ్రౌండ్స్‌కి వెళుతున్నాం. అధికారులు, నాయకులు చర్యలు చేపట్టి మైదాన స్థలం కబ్జాల బారిన పడకుండా చర్యలు చేపట్టాలి.

- నాగేశ్వరరావు, మెట్టుగూడ వాసి

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : తలసాని



హమాల్‌బస్తీలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న తలసాని శ్రీనివాస్ యాదవ్

పద్మారావునగర్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యతనిస్తానని సనత్‌నగర్ శాసనసభ్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార దిశగా మంగళవారం ఆయన పద్మారావునగర్‌లో పర్యటించి రూ.96 లక్షల అభివృద్ధి పనులను ప్రారంభించారు. హమాల్‌బస్తీలో బాబు జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రూ.9 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. తమ బస్తీలోని టాయిలెట్స్ శిథిలావస్థకు చేరుకున్నాయని, నూతన టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని స్థానికులు తలసానికి విన్నవించారు. స్పందించిన ఆయన నూతన టాయిలెట్స్ నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సాయిబాబా ఆలయం లేన్‌లో రూ.55 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులు ఈ ప్రాంతంలో డ్రైనేజీ ఓవర్‌ఫ్లో అవుతుందని సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు తెలిపారు. కాలనీలో పర్యటించి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జలమండలి అధికారులకు సూచించారు. వీటితో పాటుగా బాపూజీనగర్ శ్మశాన వాటికలో రూ. 32 లక్షలతో గదులు, టాయిలెట్స్, సీసీ ఫ్లోరింగ్ నిర్మాణం వంటి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ కుర్మ హేమలత, డీసీ డాకు నాయక్, ఈఈ సుబ్రమణ్యం, జలమండలి జీఎం వినోద్, పద్మారావునగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి గుర్రం పవన్‌కుమార్ గౌడ్, వెంకటేశన్‌రాజు, లక్ష్మిపతి, ప్రేమ్‌కుమార్, అంబులెన్స్ సురేశ్, కుమార్ యాదవ్, శైలేందర్, హరిచారి, సాయిరామ్‌చారి, పుష్పంత్‌రెడ్డి, కుషాల్, అనిత, అమృత, కౌసల్యలు పాల్గొన్నారు.

రైళ్లపై రాళ్లతో దాడి చేస్తే కఠిన చర్యలు

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : కదులుతున్న రైళ్లపై రాళ్లతో దాడి చేసిన ఆకతాయిలపై సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ పోలీసులు కేసులు నమోదు చేశారు. సికింద్రాబాద్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే రైళ్లపై ఎవరైనా సరే రాళ్లతో దాడికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, ఇప్పటివరకు 102 మందిని అరెస్టు చేశామని తెలిపారు. రైల్వే ట్రాక్‌లపై ప్రమాదకరమైన వస్తువులు ఉంచడం, దుశ్చర్యలకు పాల్పడవద్దని ఆర్పీఎఫ్ సూచించింది. అదేవిధంగా రైలు పట్టాలు దాటుతున్న వారిపై కూడా కేసులు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. 153 సెక్షన్ చట్టం కింద రైల్వే యాక్టు ప్రకారం చర్యలు తీసుకుంటామని ఐదేళ్ల వరకు జైలు శిక్ష ఉంటుందని తెలిపారు.

మందకృష్ణ సన్మానానికి తరలిరావాలి



అడ్డగుట్టలో నిర్వహించిన పార్టీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అడ్డగుట్ట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ నాగోల్‌లో ఈ నెల 19న వికలాంగుల ఆధ్వర్యంలో జరిగే పద్మశ్రీ మందకృష్ణ ఘన సన్మానానికి ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి రావాలని వీహెచ్‌పీఎస్ కోర్ కమిటీ చైర్మన్ లేదల గోపాల్ పిలుపునిచ్చారు. మంగళవారం అడ్డగుట్టలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు విజయరావు, డప్పు మల్లికార్జున్, వీహెచ్‌పీఎస్ సికింద్రాబాద్ నాయకులు సరిత, శైలజ రాధిక, వాణి, రమ, మహేష్, నర్సింగ్, రవి, ఎంఎంఎస్ జిల్లా నాయకులు సూరారం సుజాతలు పాల్గొన్నారు.

సమష్టి కృషితో ఉత్తమ ఫలితాలు

చిలకలగూడ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్, న్యూబోయిగూడ, రైల్ కళారంగ్‌లో మంగళవారం దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ 113వ జనరల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ద.మ. రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ విచ్చేసి ప్రసంగించారు. రైల్వే ఉద్యోగులు, కార్మికులు అంకిత భావంతో పని చేయడం వల్ల జోన్ భారతీయ రైల్వేలో 4వ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్, ద.మ.రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య మాట్లాడుతూ 8వ వేతన సంఘం పెన్షనర్స్‌కు కూడా అమలు చేయాలని అన్నారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ యిచ్చారు. ఈ సమావేశంలో జోన్ అధ్యక్షుడు ఎ.ప్రభాకర్, సంఘ్ సంయుక్త కార్యదర్శి భరణీ భానుప్రసాద్, సహాయ కార్యదర్శి రుద్రారెడ్డి, మీడియా ప్రతినిధి షేక్ రవూఫ్ జోన్‌లోని వివిధ డివిజన్ల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.



కనుల పండువగా పతాకావిష్కరణ

బొలంరాయిలోని సెయింట్ ఆంథోనీస్ చర్చిలో మంగళవారం రాత్రి పతాకావిష్కరణ కార్యక్రమం కనుల పండువగా జరిగింది. ఫాదర్ బాల జోసెఫ్, పీసీసీ కార్యదర్శి ఎస్.రాజేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. - సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి



ధన్యవాదాలు

చిలకలగూడలోని దూద్‌బావి పాఠశాలకు వెళ్లే దారిలో అడ్డుగా ఉన్న ప్రహరీ తొలగించి హైడ్రా బడికి బాట చూపిన నేపథ్యంలో మంగళవారం పాఠశాల విద్యార్థులు, ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్‌రెడ్డి బుద్ధభవన్‌లోని కార్యాలయంలో కమిషనర్ రంగనాథ్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. - చిలకలగూడ, ఆంధ్రజ్యోతి

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుచేయాలి

- తర్వాతే పంచాయితీ ఎన్నికలు నిర్వహించాలి
- సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సోమనబోయిన సింహాద్రి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొ. సోమనబోయిన సింహాద్రి తదితరులు

తార్నాక, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పెంచిన తర్వాతే పంచాయితీ ఎన్నికలు నిర్వహించాలని సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.సోమనబోయిన సింహాద్రి డిమాండ్ చేశారు. మంగళవారం తార్నాకలోని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని హామీ ఇచ్చి, కాంగ్రెస్ పార్టీ పంచాయితీ ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా మోసం చేసే యత్నం చేస్తుందని తీవ్రంగా మండిపడ్డారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పెంచుతున్నట్లు అసెంబ్లీలో చట్టం చేసి కేంద్రానికి పంపించి చేతులు దులుపుకుందని, ఇప్పటివరకు కేంద్రం ఆమోదించేవిధంగా ఎలాంటి ఒత్తిడి తీసుకురాకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవరించిందన్నారు. ఇప్పటికైనా బీసీల పట్ల మోసపూరిత వైఖరిని అవలంభించకుండా, 42 శాతం రిజర్వేషన్లను కల్పించిన తర్వాతే పంచాయితీ ఎన్నికలకు పోవాలని, లేనిపక్షంలో వచ్చే ఎన్నికల్లో బీసీలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో సమాజ్‌వాది పార్టీ ఉపాధ్యక్షుడు డా. నిమ్మతోట వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొకటి లక్ష్మణ్ పాల్గొన్నారు.



రాష్ట్రమంత్రి వివేక్‌ను సన్మానిస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

రాష్ట్రమంత్రి వివేక్‌కు శుభాకాంక్షలు : ఎమ్మెల్యే శ్రీగణేష్

మారేడుపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మైనింగ్ శాఖ మంత్రిగా వివేక్ వెంకటస్వామి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మంగళవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని మాజీమంత్రి డాక్టర్ గీతారెడ్డి నివాసంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్, సీనియర్ కాంగ్రెస్ నేతలు ముప్పిడి మధుకర్‌లు మర్యాద పూర్వకంగా కలిసి శాలువ కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేతలు సంకి రవీందర్, భాస్కర్, సదానంద్, మురళీ ముదిరాజ్, నాగేష్ యాదవ్, డి.బాబురావ్, పెద్దాల నర్సింహ, మల్లేష్, శివ, రేపాల తదితరులు పాల్గొన్నారు.

విలీనం చేయాలి.. కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు జరిగేలా చూడాలి

సికింద్రాబాద్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేసి సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డును జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని, విలీనం ప్రక్రియ ఆలస్యమయ్యే పక్షంలో కంటోన్మెంట్ బోర్డుకు ఎన్నికలు నిర్వహించేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావును సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయనను కలిసి కొద్దిసేపు ఆయా అంశాలపై చర్చించారు.

దేశాభివృద్ధిపై బీజేపీ చర్చాగోష్ఠి



సమావేశంలో మాట్లాడుతున్న చీర శ్రీకాంత్

రాంగోపాల్‌పేట్, జూన్ 17(ఆంధ్రజ్యోతి) : వికసిత్ భారత్ లక్ష్యంగా సాగుతున్న ప్రధాని మోదీ సుపరిపాలన 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు 11 సంవత్సరాల్లో జరిగిన దేశాభివృద్ధి, పేదల సంక్షేమం, మహిళలు, బడుగు బలహీన వర్గాల సాధికరత వంటి అంశాలపై రాంగోపాల్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో చర్చాగోష్ఠి (రచ్చబండ) కార్యక్రమం నిర్వహించారు. చర్చాగోష్ఠిలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చీర శ్రీకాంత్ పలు అంశాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ కన్నూరి చంద్రకుమార్, డివిజన్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ సూర్యవంశీ, కార్యదర్శులు సంతోష్, కల్యాణి, కోశాధికారి నరేందర్ నితేష్ భోలే, దుర్గా ప్రసాద్, గోపి కిషన్, లక్ష్మీనారాయణ ఖోలేరియా, మహిళా నాయకులు నిర్మల, స్వప్నా కోమల్, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.



యోగా చేస్తున్న మహిళలు, పురుషులు

యోగాతో మనస్సుకు ప్రశాంతత

- యోగా గురువు ఓంప్రకాశ్ స్వర్ణ

పద్మారావునగర్ జూన్ 17(ఆంధ్రజ్యోతి): యోగా అనేది భారతీయ ప్రాచీన సంప్రదాయాన్ని ప్రతిబింబించే ఆధ్యాత్మిక ప్రక్రియ అని, ఇది శరీరానికి, మనస్సుకు ప్రశాంతతనిస్తుందని ప్రముఖ యోగా గురువు ఓంప్రకాశ్ స్వర్ణ అన్నారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం పత్రికా సమాచార కార్యాలయం, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ కార్యాలయాలు సంయుక్తంగా 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాయి. యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవటం, శారీరక దారుఢ్యం, మానసిక ప్రశాంతత లభిస్తుందని పీబీబీ అదనపు డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్ తెలిపారు. నేచర్‌క్యూర్ ఆసుపత్రి వైద్యురాలు డా.వైష్ణవి మహిళల ఆరోగ్య సమస్యలకు సంబంధించి ప్రాణాయామం, ఆసనాలు, యోగా పద్ధతులను ప్రదర్శించారు. నాడి శోధన, అనులోమ్, విలోమ్ వంటి శ్వాస పద్ధతుల ద్వారా ఒత్తిడి నుంచి ఎలా ఉపశమనం పొందాలో వివరించారు. యోగా కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

సీఎం ప్రజావాణికి 272 దరఖాస్తులు

బేగంపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణికి మొత్తం 272 దరఖాస్తులు వచ్చాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 51, రెవెన్యూ 74, ఇందిరమ్మ ఇళ్ల కోసం 28, విద్యుత్ శాఖకు 24, ప్రవాసి ప్రజావాణికి 2 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 93 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి సంబంధిత అధికారులతో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.